## నేడు హైద్రాబాద్‌లో రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర



సికింద్రాబాద్, అక్టోబర్ 31, ప్రభాతవార్త : దేశ విచ్ఛిన్నానికి పాల్పడుతున్న బీజేపీ పాలనను అంతం చేసేందుకే పాదయాత్ర చేపట్టినట్లు చెబుతున్న రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర తెలంగాణ రాష్ట్రంలో విజయవంతంగా సాగుతోంది. ఆరు రోజులుగా సాగుతున్న యాత్ర మంగళవారం హైద్రాబాద్‌లో జరుగనుంది. చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి వద్ద రాహుల్ గాంధీ దర్శనం చేసుకొని యాత్రను కొనసాగించనున్నారు. నెక్లెస్‌రోడ్ మీదుగా సాగే యాత్ర లో భాగంగా నెక్లెస్‌రోడ్డులో రాహుల్‌గాంధీ కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించనున్నారు. ముందుగా సనత్‌నగర్ నియోజకవర్గం మీదుగా యాత్రను జరుపుతారని అనుకున్నప్పటికి రోడ్ మ్యాప్‌ను మార్చడం వల్ల ఖైరతాబాద్ నియోజకవర్గంలోని నెక్లెస్‌రోడ్డులో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. కాగా సికింద్రాబాద్ పార్లమెంట్ మాజీ సభ్యుతు అంజన్‌కుమార్ యాదవ్ తో పాటు మరికొంతమండి నేతల నేతృత్వంలో రాహుల్‌గాంధీకి భారీ స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు జరుపుతున్నారు.

# త్వరలో మెట్రో చార్జీల పిడుగు

### గరిష్టంగా రూ.100కు పెంచే అవకాశం



హైదరాబాద్, అక్టోబరు 31 ప్రభాతవార్త : మెట్రోలో జర్నీ సామాన్యుడికి మరింత ప్రియం కానుందనే సంకేతాలు వెలువడుతున్నాయి. నగరంలో నాలుగేళ్ల క్రితం నుంచి మెట్రో మార్గం అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ అభ్యర్థన మేరకు ప్రస్తుతమున్న ఛార్జీల సవరణకు కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సురేంద్రకుమార్ బగ్గె, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, రిటైర్డు జస్టిస్ శ్యామ్‌ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఫేర్ ఫిక్షేషన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి నగరవాసులు, మెట్రో ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను ఈనెల 15వ తేదీలోగా ఈ-మెయిల్ ద్వారా పంపించాలని హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ బహిరంగంగా ప్రకటించింది. ప్రస్తుతం మెట్రోలో కనీస చార్జీ రూ.10, గరిష్టంగా రూ.60 వసూలు చేస్తున్నారు. 2017 నవంబరు 28న ఈ ఛార్జీలను నిర్ణయించారు. కాగా, నగర మెట్రోలో కనీస చార్జీ ప్రస్తుతం ఉన్న రూ.10 నుంచి రూ.20కి, గరిష్ట చార్జీ రూ.60 నుంచి రూ.100కి పెంచే అవకాశాలున్నట్లు తెలిసింది.

నగరంలో తొలిదశ మెట్రో ప్రాజెక్టు ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోల్-రాయదుర్గం మూడు మార్గాల్లో 69.2 కిలోమీటర్ల మేర అందుబాటులోకి వచ్చింది. ఈ మూడు రూట్లలో 57 రైళ్లను నడుపుతున్నారు. నిత్యం సుమారు 4లక్షల మంది జర్నీ చేస్తున్నారు. కాగా అన్ని మెట్రో స్టేషన్లలో ప్రయాణికులు తమ ద్విచక్ర వాహనాలు, కార్లను ఉచితంగా పార్కింగ్ చేసుకునే అవకాశం లేకపోవడం, తమ ఇళ్ల నుంచి స్టేషన్లకు చేరుకునేందుకు ప్రత్యేకంగా షటిల్ సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకుంటున్నారు.

### చేనేతకు జిఎస్‌టీ మినహాయించాలి : మంత్రి తలసాని



చేనేత కార్మికులకు జిఎస్‌టీతొలగించాలని పోస్టు కార్డును ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 31 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం విధించిన 5శాతం జిఎస్‌టీ వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు జిఎస్‌టీ విధించడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కోరుతూ సోమవారం మారేడ్‌పల్లిలోని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. ముడిసరుకులపై జిఎస్‌టీ ఎత్తి వేయాలని ప్రధాని మోడీకి మంత్రి పోస్టుకార్డును పంపారు.

### నెక్లెస్‌రోడ్‌లో ఉత్సాహంగా

## సిఆర్‌పిఎఫ్ "సమైక్యతా పరుగు"

### హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



రన్‌ను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, రన్‌లో పాల్గొన్న రన్నర్లు

హైదరాబాద్, అక్టోబరు 31,ప్రభాతవార్త: హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేయడంలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ కీలక పాత్ర పోషించారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పటేల్ జయంతిని పురస్కరించుకుని సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం 5కెరన్‌ను ఏర్పాటు చేశారు. ఈరన్‌ను నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఎంపి లక్ష్మణ్‌తో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వల్లభాయ్‌పటేల్ నిర్వహించిన పోలీస్ యాక్షన్ కారణంగానే హైదరాబాద్ భారత్‌లో విలీనమైందన్నారు. ఆయన జయంతిని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తగా సమైక్యతా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. 5కెరన్ పరుగులో సిఆర్‌పిఎఫ్ అధికారులు, సిబ్బందితోపాటు వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

### ప్రభుత్వ సిటీ కళాశాలలో

## జాతీయ ఐక్యత దినోత్సవం





కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ సిటీ కళాశాల విద్యార్థులు

చార్మినార్, అక్టోబరు 31 ప్రభాతవార్త : జాతీయ ఐక్యత దినోత్సవాన్ని సోమవారం ప్రభుత్వ సిటీ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయి పటేల్ స్ఫూర్తితో మనమంతా ఐక్యత గానం ఆలపించాలని కోరారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ జన్మదినం సందర్భంగా సిటీ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి వాలంటీర్లు, వెక్ విద్యార్థులు ఐకత్య ప్రమాణం చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి డాక్టర్.నాగరాజు, డాక్టర్ జయ కాగడా, ఎన్‌సిసి అధికారి డాక్టర్ క్రిష్ణవేణి, వెక్ కన్వీనర్ డాక్టర్ శ్రీ దేవితో పాటు పలువురు పాల్గొన్నారు.

### దివ్యాంగ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

చిక్కడపల్లి, అక్టోబరు 31, ప్రభాతవార్త : వికలాంగుల పిలుపు మాసపత్రిక 13 వసంతాల సందర్భంగా దివ్యాంగుల విద్యార్థులను ప్రోత్సహించాలనే సంకల్పంతో పది, ఇంటర్, డిగ్రీలలో అత్యున్నత మార్కులు సంపాదించిన దివ్యాంగ విద్యార్థి, విద్యార్థులకు నవంబరు 3న ప్రతిభ అవార్డులను అందించాలని నిర్ణయించినట్లు సంపాదకులు కొల్లి నాగేశ్వర రావు వివరించారు. ఆ రోజు రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో ఎంపిక చేసిన వారికి ప్రతిభా అవార్డులను అందిస్తామని, ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ డాక్టర్ కె.వి.రమణాచారి హాజరై అవార్డులను అందిస్తారని, అశ్విని గ్రూప్ సంస్థల చైర్మన్ సిహెచ్.సుబ్బారావు, చేతన ఫౌండేషన్ నుంచి సిహెచ్.మాధవి తదితరులు పాల్గొంటారన్నారు.



హైదరాబాద్ వార్త

### చేనేత వస్త్రాలపై

## జిఎస్టీని రద్దు చేయాలి

**పోస్టు కార్డులతో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టిన చేనేత కార్మికులు**




నిజాం కళాశాల ప్రాంగణంలో జిఎస్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఎల్.రమణ, రాపోలు ఆనంద్‌భాస్కర్

సైఫాబాద్, అక్టోబరు 31 ప్రభాతవార్త: చేనేత వస్త్రాలపై జిఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేనేత కార్మికులు ప్రధాని నరేంద్రమోదీకి రాసిన లక్షలాది పోస్టు కార్డులతో వేలాది మంది కార్మికులు సోమవారం నగరంలో భారీగా ప్రదర్శన నిర్వహించారు. నిజాం కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభమైన ప్రదర్శన అబిడ్స్‌లోని జిపిఓ కార్యాలయం వరకు జరిగింది. ప్రదర్శనలో కార్మికులు సిఎం కెసిఆర్, రాష్ట్ర మంత్రి కెటిఆర్ ఫోటోలను ప్రదర్శిస్తూ, ప్లకార్డులు చేబూని పెద్ద ఎత్తున జిఎస్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకు ముందు నిజాం కళాశాల ప్రాంగణంలో కూడా నినాదాల హోరు కొనసాగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌సి ఎల్.రమణ, పార్లమెంట్ మాజీ సభ్యులు రాపోలు ఆనంద్‌భాస్కర్ తదితరులు పోస్టు కార్డులను ప్రదర్శించి ప్రసంగించారు. ఎల్.రమణ, రాపోలు ఆనంద్‌భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికుల పట్ల క్రూరంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. కార్మికులకు ఉన్న సంక్షేమ పథకాలను రద్దు చేసి చేనేత వృత్తి నుంచి దూరం చేస్తున్నదని విమర్శించారు. నాడు జాతిపిత మహాత్మాగాంధీ దేశ స్వాతంత్యం కోసం అత్యంత కీలకమైన ఆయుధంగా వాడిన చేనేత ఉత్పత్తులపైన చరిత్రో ఎన్నడు లేని విధంగా జిఎస్టీ కేంద్ర ప్రభుత్వం విధించిందనివారు ధ్వజమెత్తారు. జిఎస్టీని ఎత్తివేయాలన్న ఒకే ఒక డిమాండ్‌తో రాష్ట్రంలోని లక్షలాది మంది కార్మికులు ప్రధానికి పోస్టు కార్డులు రాయడం జరిగిందన్నారు. జిఎస్టీని రద్దు చేసేంతవరకు ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ ప్రదర్శనలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు కర్నాటి విద్యాసాగర్, చేనేత కార్పోరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, పవర్లూమ్ కార్పోరేషన్ చైర్మన్ గూడురి ప్రవీణ్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, పద్మశాలి సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మిక సొసైటిల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### చిన్నారులకు 'బాలరత్న' అవార్డు'ల ప్రదానం

చిక్కడపల్లి, అక్టోబరు 31, ప్రభాతవార్త : కమలాకర లలిత కళాభారతి సాంఘిక, సామాజిక సాహిత్య, సాంస్కృతిక ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నవంబరు 20న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగాన సభలో చిన్నారులకు 'బాలరత్న' అవార్డు'లను బహుకరించబోతున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎం.భారతీ కమలాకర్ వివరించారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ జయంతి సందర్భంగా లలిత కళలు, సంగీత, నాట్యం, మిమిక్రి తదితర కళలలో తమతమ ప్రజ్ఞలను ప్రదర్శించి అనేక బహుమతులు పొందిన చిన్నారులను ఎంపిక చేసి బాలరత్న అవార్డులను అందిస్తామన్నారు.

# ఒంటరి మహిళలే లక్ష్యంగా నేరాలు

**మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్**

**బైక్,ఆభరణాలు స్వాధీనం, రిమాండ్‌కు తరలింపు**

**నిందితుడిపై గతంలో పిడియాక్టు సహా ఆరు కేసులు**






వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి రామలింగరాజు, సిఐ రమణారెడ్డి,నిందితుడి వద్ద స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, బైక్

దుండిగల్, అక్టోబర్ 31 ప్రభాతవార్త : ఒంటరి మహిళపై అఘాయిత్యానికి పాల్పడి హత్య చేసిన నిందితున్ని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద బైక్, ఆభరణాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. సోమవారం సాయంత్రం దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఘటనకు సంబంధించిన వివరాలను ఎసిపి రామలింగరాజు వెల్లడించారు. వనపర్తి జిల్లా, కల్వకుర్తికి చెందిన ఉర్సు శివ అలియాస్ సూర్య (44) కొన్నేళ్ళ క్రితం జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చి రాజేంద్రనగర్ పరిధి బండ్లగూడలోని వినాయకనగర్‌లో నివాసం ఉంటూ తాపీ మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈక్రమంలో దురలవాట్లు, జల్సాలకు బానిసైన శివ నేరాలకు పాల్పడడం మొదలుపెట్టాడు. ప్రధానంగా ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకొని వారిని మాయమాటలతో ప్రలోభపెట్టి నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశాలకు తీసుకెళ్ళి అత్యాచారం జరిపి వారి నగలను దోచుకొని అక్కడి నుండి పారిపోయేవాడు. ఇలా వివిధ ప్రాంతాల్లో పలు నేరాలకు పాల్పడిన శివపై ఆర్‌జిఐ ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ మూడు కేసులు, రాజేంద్రనగర్ పిఎస్‌లో ఒక కేసు, మోయినాబాద్ పిఎస్‌లో రెండు కేసులతో పిడియాక్టు, నార్సింగి పిఎస్‌లో ఒక కేసు నమోదయ్యాయి. నార్సింగి పిఎస్ ఉన్న కేసులో శివకు ఐదు సంవత్సరాల కారగార శిక్షను విధించారు. అయితే గత రెండు నెలల క్రితం బెయిల్‌పై వచ్చి దుండిగల్ మున్సిపాలిటీ పరిధి 120 బస్తీకి తన మకాం మార్చి కూలీపనులు వెళ్తుండేవాడు. ఈక్రమంలో ఈనెల 14న కల్లుకాంపౌండ్‌కు వెళ్ళిన శివ కన్ను అక్కడ ఉన్న ఎలపర్తి లక్ష్మీపై పడింది. కల్లు తాగుతూ ఆమెతో మటామాట కలిపి ఫోన్ నంబర్ తీసుకున్నాడు. మరుసటి రోజు ఉదయం భౌరంపేట ఇందిరమ్మకాలనీలో ఉన్న లక్ష్మీ ఇంటికి వెళ్ళాడు. తన వెంట తీసుకెళ్ళిను మద్యంను ఇద్దరు కలిసి తాగిన తరువాత ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు దోచుకునేందుకు ప్రయత్నించగా కేకలు వేయడంతో పక్కనే దిండు తీసుకొని మొఖం అదిమిపట్టి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడు. ఆమె మృతిచెందినది అని నిర్ధారించుకున్న తరువాత ఒంటిపై ఉన్న నగలు, మొబైల్ ఫోన్ తీసుకొని ఇంటి బయట తాళం వేసి పారారైయ్యాడు. లక్ష్మీ ఇంటి నుండి దుర్వాసన రావడానికి గమనించిన ఇరుగు పొరుగు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించి కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఈనేపథ్యంలో సోమవారం గండిమైసమ్మలో కొత్త బైక్‌పై అనుమానస్పదంగా తిరుగుతున్న శివను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడు. తాను కాజేసిన సొత్తు దమ్మాయిగూడలో ఓ ఫాన్ బ్రోకర్ వద్ద తాకట్టు పెట్టి రూ,50వేలు తీసుకొని కొత్త బైక్ కొనుగోలు చేసినట్లు తెలిపాడు. మృతురాలి వద్ద కాజేసిన 15.236గ్రాముల బంగారు చైన్, 5.945గ్రాముల బంగారు చెవి కమ్మలు, 371.7 గ్రాములు వెండి కాళ్ళ కడియాలు, 153.700 వెండి కాళ్ళ పట్టీలు, మొబైల్ ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. మహిళ హత్యకు కేసును చాలేజింగ్‌గా తీసుకొని నిందితున్ని పట్టుకొని సొత్తును రికవరి చేసిన సిబ్బందిని ఎసిపి అభినందించారు. ఈసమావేశంలో సిఐ రమణారెడ్డి, ఎస్సైలు శ్రీనివాస్, క్రిష్ణ, ఎఎస్సై రాములు, క్రైమ్ సిబ్బంది సాయి తదితరులు పాల్గొన్నారు.

### రైల్వే రక్షణ ప్రత్యేక దళం ఆధ్వర్యంలో రన్‌ఫర్ యునిటీ బైక్ ర్యాలీ



మౌలాలి ఆర్పీఎస్ఎఫ్‌లో రన్ ఫర్ యునిటీ బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారి

మెట్టుగూడ, అక్టోబర్ 31 ప్రభాతవార్త: భారత తొలి హోంమంత్రి వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని మౌలాలిలోని 7వ బెటాలియన్ రైల్వే రక్షణ ప్రత్యేక దళం(ఆర్పీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఏక్తా దివాస్ సంస్మరణలో బాగంగా రన్‌ఫర్ యునిటి బైక్ ర్యాలీ మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐజి రాజారామ్, అసిస్టెంట్ కమాండెంట్ ఆఫీసర్ డి.శ్రీనివాసరావు, జైమల్ శ్రీవాస్తవతో పాటు 7వ బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.15.కోట్ల 40.లక్షల పనులకు ఆమోదం తెలిపిన కౌన్సిల్ సమావేశం




బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్‌లు

నార్సింగి, అక్టోబర్ 31 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో రూ.15.కోట్ల 40.లక్షల అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కార్పోరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పోరేటర్లంతా సమిష్టి నిర్ణయాలు తీసుకొని బండ్లగూడను అభివృద్దిలో ముందజంలో ఉంచుతున్నారని తెలిపారు. ప్రజల సమస్యలు ఎక్కడుంటే అక్కడ వాలిపోయి వెను వెంటనే పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులకు సూచించారు. పని చేసిన నాయకులకు ఎన్నికల వేళ ప్రజలు అండగా నిలుస్తారని, ప్రజల నమ్మకాన్ని పెంచుకునేందుకు నాయకులు పాటు పడాలన్నారు. రాజకీయం అంటే ప్రజలకు సేవ చేయడం అన్న విషయంను నాయకులంతా గుర్తుంచుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ సమర్ధవంతంగా అమలు చేస్తున్న మిషన్ భగీరథతో తాగునీటి సమస్య పూర్తిగా తొలిగిపోయిందన్నారు. సమైక్య పాలనలో తాగునీటికి నగర ప్రజలు నరకయాతన అనుభవించారని తెలిపారు. స్వపరిపాలనలో ఆ సమస్యను పూర్తిగా అధిగమించామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజి, వీధి దీపాలు, తాగునీటి పైప్‌లైన్లు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, స్మశాన వాటికలు వంటి అభివృద్ధి పనుల కోసం ఈ సమావేశంలో తీర్మాణం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి, కార్పోరేటర్లు తలారి చంద్రశేఖర్, పద్మావతి పాండు, సంతోషి రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పద్మావతి పాపయ్య యాదవ్, భూపాల్‌గౌడ్, ప్రశాంత్ నాయక్, అస్లాం, రాము, ఆసియా ఖాజా, పుష్పమ్మ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీలత సురేష్‌గౌడ్, స్రవంతి నరేందర్, సాగర్‌గౌడ్, అనిత వెంకటేష్, కో ఆప్షన్ సభ్యులు మలాకి రత్నం, కవిత పెంటయ్య, జగదీష్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

### శిక్షణపొందిన రచయితల నాటకాలకు

## విశ్వవిద్యాలయంలో ప్రదర్శన

**పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు**



విశ్వవిద్యాలయంలోని తెలంగాణతల్లి విగ్రహాంవద్ద శిక్షణపొందిన విద్యార్థులతో కిషన్‌రావు, రమణాచారి, ఎం.హరికృష్ణ తదితర అతిథులు

నాంపల్లి, అక్టోబరు 31 ప్రభాతవార్త : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సమన్వయంతో ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసరంజని 5 రోజులపాటు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన ఔత్సాహిక యువ నాటక రచయితలకు నాటకం వ్రాయడం ఎలా శీర్షికన వసతి, భోజన సౌకర్యాలు కల్పించి నిర్వహించి ఉచిత శిక్షణా శిబిరం ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు ఈ శిక్షణా శిబిరంలో పాల్గొన్న నాటక రచయితలు నాటకం వ్రాసినట్లయితే వారి నాటకాలను విశ్వవిద్యాలయం విద్యార్థులచే విశ్వవిద్యాలయంలో ప్రదర్శించే అవకాశం తప్పక కల్పిస్తామని హామీనిచ్చారు. 27 నుండి నేటివరకు జరిగిన శిక్షణా శిబిరం ముగింపు వేడుకలు తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ సభాధ్యక్షతన జరుగగా విశిష్ట అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి, ప్రముఖ సినీ నాటక రచయిత ఎం.దివాకర్‌బాబు, ఇ.ప్రేమ్ రాజ్, విశ్వవిద్యాలయం లలితకళాపీఠం డీన్ డా. కోట్ల హనుమంతరావు, తడకమళ్ళ రాంచందర్‌రావు, రసరంజని కార్యదర్శి ఎం.కామేశ్వరరావు, కోశాధికారి మోహన్‌సేనాపతి, అరుణకుమార్ తదితరులు పాల్గొనగా డా. కె.వి.రమణాచారి మాట్లాడుతూ 5రోజులపాటు శిక్షణపొందిన విద్యార్థులు తమ కలాలకు పదునుపెట్టి, నేర్చుకున్న విషయాలను అక్షరరూపమిచ్చి అద్భుతమైనరీతి, తమదైన ప్రత్యేకశైలిలో మంచి నాటకాలను రచించాలన్నారు. మామిడిహరికృష్ణ అధ్యక్షోపన్యాసంలో తెలంగాణ రాష్ట్రంలో నాటక అభివృద్ధిని వల్లెవేశారు. చివరిగా ఈ శిక్షణా శిబిరంలో శిక్షణ పొందిన యువనాటక రచయితలను ఘనంగా సత్కరించి అతిథుల చేతులమీదుగా ప్రశంసాపత్రాలను అందజేసి అభినందన పూర్వక శుభాశీస్సులు అందజేశారు.

# నిజాం కళాశాల హాస్టల్‌లో ప్రవేశం కల్పించాలి



బషీర్‌బాగ్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు

సైఫాబాద్, అక్టోబరు 31 ప్రభాతవార్త: నిజాం కళాశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అమ్మాయిల హాస్టల్‌లో అండర్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు తక్షణమే ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది విద్యార్థులు సోమవారం బషీర్‌బాగ్‌లో రాస్తారోక్ నిర్వహించారు. కళాశాలలోని అన్ని విద్యార్థి సంఘాల విద్యార్థులు ఈ రాస్తారోకోలో పాల్గొని కళాశాల ప్రిన్సిపల్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. రాస్తారోకోతో ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసుల విద్యార్థులను ఆందోళన విరమించాలని కోరినప్పటికి విద్యార్థులు పట్టించుకోకుండా ఆందోళన కొనసాగించారు. కాగా కొంత మంది విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని తిరిగి విడుదల చేశారు. అయినప్పటికి విద్యార్థులు వినకుండా కళాశాలలో ప్రిన్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. నినాదాల హోరును కొనసాగించారు. హాస్టల్‌లో యుజి విద్యార్థులకు ప్రవేశం కల్పించాలని, ప్రిన్సిపల్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రియ, సౌందర్య, పవిత్ర, స్వప్న, విధిత, తిరుపతి తదితరులు మాట్లాడుతూ కళాశాలలో డిగ్రీ చదువుతున్న అమ్మాయిల కోసం హాస్టల్ భవనాన్ని నిర్మిస్తామని గతంలో రాష్ట్ర మంత్రి కెటిఆర్ హామీ ఇచ్చారని, ఆ హామీ ప్రకారం హాస్టల్ భవనం నిర్మాణం జరిగిందని చెప్పారు. ఈ హాస్టల్ భవన్‌లో డిగ్రీ విద్యార్థులకే వసతి సౌకర్యం తక్షణమే కల్పించాలని, పిజి విద్యార్థులకు కల్పించరాదని చెప్పారు. హాస్టల్ వసతి కోసం వందలాది మంది అమ్మాయిలు ఎదురు చూస్తున్నారని, బయట వేలాది రూపాయలు చెల్లించి వసతి సౌకర్యం పొందే స్థితిలో లేమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రవేశం కల్పించాలని కోరారు. గతంలో పలు మార్లు కళాశాల ప్రిన్సిపల్‌కు వినతి పత్రాలు సమర్పించి, విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని వారు ఆరోపించారు. అనంతరం విద్యార్థుల ప్రతినిధి బృందం కళాశాల ప్రిన్సిపల్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యను ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్‌తో చర్చించి ఐదురోజుల్లో తగు నిర్ణయిం తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# ఉప్పల్‌లో ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు



ఉప్పల్‌లో మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఉప్పల్ కాంగ్రెస్ నేతలు

**ఉప్పల్, అక్టోబరు 31 ప్రభాతవార్త :** మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు ఆదివారం ఉప్పల్‌లో ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముళ్ళ పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పలువురు పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టిపిసిసి ప్రతినిధులు, మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి, ఎం.డి.తౌఫిక్, సీనియర్ కాంగ్రెస్ నేతలు పసుల ప్రభాకర్‌రెడ్డి, బోరంపేట కృష్ణ, చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు కొంపల్లి బాలరాజు, బాకారం లక్ష్మణ్, కాలేరు జైనవీన్, ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అకారపు అరుణ్‌కుమార్, షేక్ మదర్‌వలీ, సీనియర్ నాయకులు మురళీ, పల్లె రమేష్, కోమటిరెడ్డి కృష్ణారెడ్డి, బూర్గల రమేష్‌గౌడ్, సుశీల, రమేష్, అమరేశ్వరి, మహేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ స్వర్గీయ ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఇందిరాగాంధీ ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. అనంతరం ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బ్యాంక్‌లను జాతీయం చేసిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు లుకాస్, సల్ల ప్రభాకర్‌రెడ్డి, తుమ్మల దేవిరెడ్డి, సుంకు శేఖర్‌రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, రాజు, మంద మురళీకృష్ణారెడ్డి, అలీమ్, సుధాకర్, సందీప్, భాస్కర్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలను కాపాడడంలో ఏఐటీయూసీ కీలకం




ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న రవీంద్రాచారి

**హయత్‌నగర్, అక్టోబరు 31 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా ఎన్నో కార్మికఉద్యమాలను నిర్వహించి కార్మికుల పక్షాన నిరంతర పోరాటం చేసి రాజ్యాంగ పరమైన కార్మిక చట్టాలను కాపాడడంతో ఏఐటీయూసీకీలకంగా వ్యవహరిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రాచారి అన్నారు. ఏఐటీయూసీ 103వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ రావినారాయణరెడ్డి కాలనీలోని పార్టీ కార్యాలయంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల కమిటీ కార్యదర్శి హరిసింగ్‌నాయక్ ఆధ్వర్యంలో ఆయన ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రవీంద్రచారి మాట్లాడుతూ... ఎందరో కార్మిక నాయకులు, ప్రజల సంయుక్త పోరాటాల ఫలితంగా నిర్మించిన ట్రేడ్‌యూనియన్ లక్ష్య సాధనలో ప్రతికార్మికుడు కలిసి రావాలని సూచించారు. కేంద్రంలో మోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి దేశసంపదను దోచి గుజరాతీ పెట్టుబడిదారులకు అప్పచెబుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. పెత్తందారి వ్యవస్థను రూపుమాపి కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు మరో స్వాతంత్ర్య పోరాటం తరహా ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, నాయకులు దాసరి ప్రసాద్, వేణుగోపాలచారి, నర్సింహ, నారాయణ, నవనీత, అరుణ, దేవమ్మ పాల్గొన్నారు.

**హయత్‌నగర్‌లో...** హయత్‌నగర్‌లో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ట్రేడ్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చిన కేంద్ర ప్రభుత్వంపై కార్మికులంతా ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ కార్యదర్శి రమావత్ సక్రునాయక్, అధ్యక్షుడు సోమన్న, నాయకులు శ్రీను, కృష్ణ, జనార్ధన్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

# ప్రతి పేదవాడికి న్యాయ సలహా : న్యాయమూర్తి శ్రీదేవి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీదేవి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** ప్రతి పేదవాడికి న్యాయ సలహా అందించే విధంగా చొరవ చూపాలని జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ న్యాయ సేవా సదన్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జ్ ఏ.శ్రీదేవి సూచించారు. సివిల్‌జడ్జి శ్రీదేవి ఆధ్వర్యంలో సోమవారం రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ న్యాయ సేవా సదన్ భవనంలో పారాలీగల్ వాలంటరీలు, న్యాయవాదులు, ఎన్జీవోస్ తదితర సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 31 నుంచి నవంబర్ 13వరకు జరుగే కార్యక్రమాల గురించి విపులముగా వివరించారు. ఇంటింటికి వెళ్లి పేదవాళ్లకు న్యాయ సలహా గురించి వివరించాలని, న్యాయవాదిని పెట్టుకునే హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కును గురించి వివరించాలని తెలిపారు. న్యాయ సలహాలు, రాజ్యాంగం కల్పించిన హక్కును గురించి ప్రతి పేదవాడికి తెలిసే విధంగా క్షుణ్ణంగా వివరించాలని సూచించారు.

# విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకుని లక్ష్యాలను సాధించాలి : ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి



లింబాద్రిని సన్మానిస్తున్న రవీంద్రనాథ్‌యాదవ్, హృదయ్‌రెడ్డి

**హయత్‌నగర్, అక్టోబరు 31 ప్రభాతవార్త:** పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా లక్ష్యాలను సాధించాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.ఆర్ లింబాద్రి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో సోమవారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు 12వ ఓరిఎంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్య విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కీలకమన్నారు. క్రమశిక్షణతో చదివి, పరిశోధనలు చేసి ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. విద్యకు సంబంధించిన నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలను గురించి ఆయన వివరించారు. ప్రిన్సిపల్ డా.సాయి సత్యనారాయణరెడ్డి విద్యార్థుల కోర్సులు, ప్రమోషన్ క్రెడిట్స్ గురించి వివరించారు. విద్యార్థుల హాజరు బయోమెట్రిక్‌తో అనుసంధానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ చింతల రవీంద్రనాథ్ యాదవ్, వైస్‌చైర్మన్ అనంతుల హృదయ్‌రెడ్డిలు కళాశాలలో విద్యార్థులకు అందించే బోధన, సదుపాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో సుమారు 500 మందికిపైగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


# లబ్ధిదారులకు ఆసరా పెన్షన్ కార్డులు : ఎమ్మెల్యే బలాల



లబ్ధిదారులకు పెన్షన్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే

**మలక్‌పేట, అక్టోబరు 31 ప్రభాతవార్త :** చావుని డివిజన్‌లోని ఎంఎన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సుమారు 250 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అహ్మద్ బలాల ముఖ్య అతిథిగా హాజరై ఆసరా పెన్షన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలోని వందలాది మందికి ఆసరా పెన్షన్‌లను అందజేయడం జరిగిందన్నారు. అర్హులందరికీ పెన్షన్‌లను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ సాలం షాహిద్, రెవెన్యూ అధికారులు మహ్మద్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో చక్కటి ఆరోగ్యం : సామ



బహుమతులను అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

**మలక్‌పేట, అక్టోబరు 31 ప్రభాతవార్త :** క్రీడలతో చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని దిల్‌సుక్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ చైర్మన్ సామ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 15వ ఆగస్టు ఇంటర్నల్ షటిల్ బ్యాడ్మింటన్ టౌర్నమెంట్ పోటీలను ఈ నెల 27వ తేదీనుండి దిల్‌సుక్‌నగర్ షటిల్ కోర్టులో నాలుగు రోజులపాటు నిర్వహించారు. రమాకాంత్, శేషుదేవ్, జట్టు లక్ష్మారెడ్డి, కృష్ణకిరణ్ జట్టు ఫైనల్ పోటీలో తలపడగా రమాకాంత్ శేషుదేవ్‌లు విజయం సాధించారు. ద్వితీయ స్థానంలో సింగిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తృతీయ స్థానంలో దేవిడి శ్రీనివాస్‌రెడ్డి నిలిచారు. విజేతలకు సామ ప్రభాకర్‌రెడ్డి నగదు బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దేవిడి శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌జాదవ్, స్వామిగౌడ్, శ్రీనివాస్‌గుప్త, కె.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హరిహర క్షేత్రంలో కార్తీక మాస పూజలు

**మలక్‌పేట, అక్టోబరు 31 ప్రభాతవార్త :** మలక్‌పేట పల్టాన్‌లోని శ్రీ హరిహర క్షేత్రంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ సూగూరు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 23వ తేదీవరకు శ్రీ ఉమా మహేశ్వరస్వామి వారికి నిత్య ఏకవార అభిషేకములు, 8వ తేదీనుండి కార్తీక పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతం, 19వ తేదీన గణపతి వార్షికోత్సవం, సాయంత్రం 5గంటలకు అభిషేకం, గణపతి హోమం, ప్రసాద వితరణ, 22వ తేదీ మాస శివరాత్రిని పురస్కరించుకుని ఉదయం మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం, నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒ రంగాచారి, అర్చకులు మంగళగిరి శ్రీనివాసాచార్యులు, సభ్యులు సరాపు శ్రీహరి, రేణుఅగర్వాల్, మల్లికార్జున్, కాసుల చంద్రశేఖర శర్మ, వనం సత్యేందన్, శెట్టి విజయ్‌కుమార్, రొడ్డ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చేనేత వస్త్రాలు ధరించి నేతన్నకు చేయూత అందించాలి : ఉప్పల

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలకు చేయూతను అందించాలని రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా విజ్ఞప్తి చేశారు. ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు తాను ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో చేనేత రంగం అభివృద్ధి చెందుతోందన్నారు. చేనేత రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. చేనేత రంగాన్ని వ్యాపార దృక్పథంతో చూడవద్దని, దేశ వారసత్వ కళా సంపదలో చేనేత రంగం భాగమన్నారు. వయోపరిమితి తగ్గించి చేనేత కార్మికులకు పింఛన్లు ఇస్తున్న ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. బతుకమ్మ చీరలు తయారుచేసే పనిని చేనేత కార్మికులకు అప్పగించి వారి ఆర్థిక పురోభివృద్ధికి సహకరిస్తున్నారన్నారు.

# చట్టాలను గౌరవించాలి : న్యాయమూర్తి భూపతి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** ప్రతి పౌరుడు శాసనాల ద్వారా రూపొందించిన చట్టాలకు గౌరవిస్తూ వాటికి లోబడి ఉండాలని, ప్రభుత్వ చట్టాలను అపహాస్యం చేయకుండా సామాజిక అవగాహనతో చట్టాలను పరిరక్షించుకోవాలని రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్‌జడ్జి సిహెచ్‌కె. భూపతి సూచించారు. ప్రభుత్వ బాలల సంక్షేమం సంస్కరణ సేవలు, వీధిబాలల సంక్షేమ శాఖ జువైనల్ డిపార్ట్మెంట్ ఆవరణలో ఏర్పాటైన రంగారెడ్డి జిల్లా బాలల న్యాయమండలి న్యాయస్థానాన్ని జిల్లా అడిషనల్ న్యాయమూర్తి తిరుపతి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఏ.శ్రీదేవి, జేజేబి ప్రిన్సిపాల్ మెజిస్ట్రేట్ ఎం.ఉషశ్రీ బాలల సంక్షేమ శాఖ ఉపసంచాలకులు డాక్టర్ మిర్జారాజాఅలీబేగ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలపై ఉన్న కేసులో త్వరగా పరిష్కరించేందుకు పోలీసుల సహకారం తీసుకోవాలని, మనం చేస్తున్న ప్రతి పని న్యాయబద్ధంగా ఉండాలన్నారు. రంగారెడ్డి జిల్లా అడిషనల్ జడ్జి ఆర్.తిరుపతి మాట్లాడుతూ చట్టాలు పక్కదారి పట్టడానికి సామాజిక అవగాహన లోపమే కారణం అన్నారు. బాధ్యతగా వ్యవహరించి సక్రమంగా చట్టాలు అమలయ్యేలా చూడాలని సూచించారు. బాలుర గృహాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సంరక్షణ గృహాల పర్యవేక్షణాధికారులు నాగేశ్వరరావు, సయ్యద్‌అఫ్జల్‌షా, ఏ.అనిల్‌కుమార్, కృష్ణవేణి, రవికుమార్ పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో ఎల్‌ఎఫ్‌డిసి విద్యార్థుల ఎక్తా దివస్ ర్యాలీ




హబ్సిగూడ రహదారిలో ఎక్తా దివస్ ర్యాలీలో పాల్గొన్న ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

**ఉప్పల్, అక్టోబరు 31 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రీయ ఎక్తా దివస్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల నుంచి హబ్సిగూడ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ విన్సెంట్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి.జయంతి, ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ ప్రశాంత్, పలువురు వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ భారతదేశాన్ని ఏకం చేయడంలో సర్దార్ వల్లబాయ్ పటేల్ చూపిన చొరవ అభినందనీయమన్నారు. ఆయన సేవలు స్మరించుకుంటూ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ నేత జగదీష్ కుటుంబ సభ్యులకు అర్థిక సహాయం



టిఆర్ఎస్ నేత స్వర్గీయ జగదీష్ కుటుంబ సభ్యులకు అర్థిక సహాయం అందజేస్తున్న ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు

**రామంతాపూర్, అక్టోబరు 31 ప్రభాతవార్త :** మునుగోడు ఎన్నికల ప్రచారానికి వెళ్లి ప్రమాదశాత్తు చెట్టు మీద నుంచి కింద పడి మృతి చెందిన రామంతాపూర్ డివిజన్ టిఆర్ఎస్ నేత తాడిశెట్టి జగదీష్‌కుమార్ కుటుంబానికి టిఆర్ఎస్ నేతలు చేయూత అందించారు. ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ల సహకారంతో జగదీష్‌కుమార్ కుటుంబ సభ్యులకు రూ.22 లక్షల అర్థిక సహాయం అందజేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎంపి రవిచంద్ర, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్ రావు చేతుల మీదుగా రూ.22 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడి మృతి చెందిన జగదీష్‌కుమార్ కుటుంబ సభ్యులకు తమ వంతు చేయూత అందించినట్లు తెలిపారు. ఎంపి రవిచంద్ర మున్నూరు కాపు సంఘం తరపున రూ.9లక్షలు, ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు, మంత్రి జగదీశ్వర్‌రెడ్డి రూ.3లక్షలు అందజేసినట్లు తెలిపారు. జగదీష్ కుటుంబానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, పార్టీ నేతలు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆలే రమేష్, వెంపటి శ్రీను, మహేందర్, ఫయాజ్, సమీర్, సాలార్, రాజు, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

# నాగోల్ డివిజన్‌లో ఘనంగా ఛట్ పూజ కార్యక్రమం



ఛట్ పూజ నిర్వహిస్తున్న కార్పొరేటర్ చింతల అరుణ

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సోమవారం ఉదయం నాగోల్ చెరువు దగ్గర మార్వాడీలతో కలిసి భక్తి శ్రద్ధలతో ఛట్ పూజలు నిర్వహించారు. ఛట్ పూజను నాలుగు రోజుల పాటు జరుపుకుంటారు. మొదటి రోజును నహాయ్‌ఖాయ్, రెండవ రోజు ఖర్న, మూడవ రోజు పెహల అర్ఘ్య, నాల్గవ రోజు పార్నగా పేరిట ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఛట్ పూజా చేసే వారు అత్యంత నిష్టగా నహాయ్‌ఖాయ్ ఆచరిస్తారు. ముఖ్యంగా ఈ వ్రతాన్ని మహిళలు ఆచరిస్తారు. ఈ కార్యక్రమంలో అమిష్, శివకుమార్‌యాదవ్, రాము, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం : కిషన్‌రెడ్డి



కొండా లక్ష్మణ్‌బాపూజీ పోస్టల్ కవర్ ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, కటకం నర్సింగ్‌రావు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమకారుడు, మాజీమంత్రి కొండా లక్ష్మణ్‌బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కే.లక్ష్మణ్ పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్‌బాపూజీ పోస్టల్ కవర్ ఏర్పాటు చేయగా కిషన్‌రెడ్డి, డాక్టర్ కే.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం బాపూజీ చివరి శ్వాస వరకు పోరాటం చేశారని ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం బాపూజీ సేవలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆలె భాస్కర్‌రాజ్, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కటకం నర్సింగ్‌రావు, కర్నాటి ధనంజయ్‌నేత, ఎల్బీనగర్ నియోజకవర్గం ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ప్రశాంత్‌ముదిరాజ్, కొత్తపేట డివిజన్ కార్యదర్శి శివనేత, పద్మశాలి సంఘం నాయకులు రావిరాల సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా చట్ పూజ వేడుకలు



చట్‌పూజలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, అక్టోబరు 31 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్ తదితర ప్రాంతాల్లో చట్‌పూజ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ నల్ల చెరువు బతుకమ్మ ఘాట్‌తోపాటు, రామంతాపూర్ చిన్న చెరువు వద్ద ఉత్తారాది రాష్ట్రాలకు చెందిన మహిళలు ఆనందోత్సవాలతో వేడుకలు జరుపుకున్నారు. రామంతాపూర్ చిన్న చెరువు వద్ద సరస్వతి పూజ సమితి ఆధ్వర్యంలో జరిగిన చట్‌పూజ కార్యక్రమానికి కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉత్తారాది రాష్ట్రాలలో సూర్య భగవానుడికి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించడం అనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి పూజ సమితి నేతలు రాంప్రకాష్‌గుప్త, భగవాన్‌సింగ్, మంజునాథ్‌గుప్త, సురేష్ సింగ్, అజయ్‌శర్మ, కమలేష్‌పాండే, రాజీవ్‌కుమార్, రాజేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పటేల్ జయంతి వేడుకలు



పటేల్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కార్పొరేటర్లు

**రామంతాపూర్, అక్టోబరు 31 ప్రభాతవార్త :** భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి సందర్భంగా రామంతాపూర్ ప్రధాన రహదారిలోని ఆయన విగ్రహానికి పలువురు బిజెపి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రామంతాపూర్, హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన తదితరులు పాల్గొని సర్దార్ వల్లబాయ్‌పటేల్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సర్దార్ వల్లబాయ్‌పటేల్ దేశ విభజన జరుగకుండా తన వంతు పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ కార్యదర్శి సంకూరి కుమారస్వామి, చింతకింది ప్రవీణ్, రంగ రవి, కె.లింగం తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సత్యవతిరాథోడ్ సేవలు అభినందనీయమం : కార్పొరేటర్ బన్నాల గీత

**ఉప్పల్, అక్టోబరు 31 ప్రభాతవార్త :** రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌ను పుర్లగడ్డ తాండలో జరిగిన కార్యక్రమంలో చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ మంత్రి సత్యవతిరాథోడ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బన్నాల గీత ప్రవీణ్ మాట్లాడుతూ మంత్రి సత్యవతి రాథోడ్ సేవలు అభినందనీయమని, పార్టీ కోసం ఆమె ఎంతో కృషి చేస్తున్నారన్నారు. టిఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, వి.బి.నరసింహా, కొండల్‌రెడ్డి, కె.జగన్, రామానుజం, రవీందర్‌గౌడ్, రాంచందర్, రాజమౌళి, శ్యామ్, బాలు, మహిళా నాయకురాలు సుభద్ర, అండాలు, షెహనాజ్, సరిత, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్‌నగర్ మార్కెట్ ఆవరణలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** ఏఐటీయూసీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.ప్రవీణ్‌కుమార్ హాజరై అరుణ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు కర్షకుల కోసం అనేక పోరాటాలు చేసి కార్మిక చట్టాలను సాధించుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుణగంటి యాదయ్యగౌడ్, ఉడుతల జంగయ్య, ఎండి రఫీ, అఫ్జల్, మహమ్మద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# సాధారణ ప్రసవాలే లక్ష్యంగా పనిచేయాలి : జిల్లా వైద్యాధికారి




వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా వైద్యాధికారి డా.పుట్ల శ్రీనివాస్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 31 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలే లక్ష్యంగా వైద్యాధికారులు పనిచేయాలని జిల్లా వైద్యాధికారి డా.పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటి జిల్లావైద్యాధికారి డా.నారాయణరావు ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్రీయ ఆరోగ్య పారామితులు, ఇతర ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డా.పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రులలో వందశాతం సాధారణ ప్రసవాలే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రిమి సి సెక్షన్ శాతం తగ్గించాలని, జిల్లాలోని పార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నిషియన్, స్టాఫ్ నర్సులతో జాతీయ, రాష్ట్రఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు ఆరోగ్య శాఖకు మూల స్థంభాలు అన్ని కొనియాడారు. అన్ని బస్తీ దవాఖానాలో టెలికాన్ఫరెన్స్, ఇ ఔషది పెంచాలని, టెటనుస్, డిప్తీరియా వాక్సిన్ కార్యక్రమం నవంబరు 7వ తేది నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులను సందర్శించి తనిఖీలు చేయాలని సూచించారు. జిల్లాను మొదటిస్థానంలోని తీసుకుని వచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగాం అధికారులు డా.ఆనంద్, డా.సంధ్య, డా.రాంకుమార్, మంజుల, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.సౌందర్యలత, సూపర్‌వైజర్ బోగ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# తుర్కయంజాల్ సహకార సంఘం పాలకవర్గం సమావేశం



సమావేశంలో పాల్గొన్న పాలకవర్గ సభ్యులు

**తుర్కయంజాల్, అక్టోబరు 31 ప్రభాతవార్త :** డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన తుర్కయంజాల్ సహకార సంఘం పాలకవర్గం సమావేశం నిర్వహించి 25 మందిని సభ్యులుగా చేర్చుకోవడం జరిగింది. సంఘం రైతులకు ఎల్.టి. అప్పులు, పంట అప్పులుగా రూ.2.96 కోట్ల రూపాయలు మంజూరు చేసారు. రైతులకు వడ్లను భద్రపరచుకోవడానికి పడాలు పంపిణీ చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా సత్తయ్య సోమవారం మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తూ, వారి అభ్యున్నతికి దోహదపడి వారి అభిమానాన్ని చూరగొన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షులు పాలకవర్గ సభ్యులు వంగేటి లక్ష్మారెడ్డి, బ్యాంకు వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవరెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, కుతాడి నర్సింగరావు, కొంద్రు స్వప్న, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణారెడ్డి, సీఈవో వై రామదాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**తుర్కయంజాల్, అక్టోబరు 31 ప్రభాతవార్త :** కార్మికుల హక్కులకోసం ఏఐటీయూసీ ఆవిర్భవించిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య పేర్కొన్నారు. అక్టోబర్ 31న అల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ఆవిర్భావ దినోత్సవన్ని పురస్కరించుకొని కార్మికులు తుర్కయంజాల్ మున్సిపాలిటీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ 1920లో ఏర్పడిన ఏఐటీయూసీ 103వ ఆవిర్భావ దినోత్సవన్ని జరుపుకుంటున్నామని, మోడీ ప్రధాని అయిన తర్వాత యాజమాన్యలకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చారని, అందులో భాగంగానే మోడీ కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చారన్నారు. కార్మికులు ఐక్య పోరాటాల ద్వారానే కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడుతారని అన్నారు.. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ సిపిఐ కార్యదర్శి జి.క్రాంతికుమార్, కార్మిక నాయకులు భరత్ బాబు, గువ్వల రాజు, భాస్కర్, సుందరమ్మ, లక్ష్మి, బ్రహ్మయ్య కోట్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.



దిల్‌సుక్‌నగర్‌లోని శ్రీషిరిడి సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా సోమవారం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమాన్ని వేద బ్రాహ్మణుల మంత్రాచరణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదేవిధంగా హోమం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.
(ప్రభాతవార్త, ఎల్.బి.నగర్)